క్లుప్తంగా

యూత్ అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి



రామచంద్రారెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మండలంలోని నడిమికల్లాడుకు చెందిన యారవ రామచంద్రారెడ్డిని వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షులుగా కేంద్ర కమిటీ నియమించినట్టు ఎమ్మెల్యే వెంకటేగౌడ స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెలిపారు. యువకులు పార్టీకోసం అవసరమని గుర్తించి ఈ పదవిని కట్టబెట్టినట్టు ఆయన చెప్పారు. ఇప్పటికే పార్టీలో మూడొందలమందిని చేర్చామని, త్వరలో యూత్‌ను భారీగా పార్టీలోకి చేర్చి పలమనేరు మండలంలో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని రామచంద్రారెడ్డి తెలిపారు.

కల్యాణమస్తు చెక్‌ల పంపిణీ



చెక్‌లను అందజేస్తున్న రెడ్డీశ్వరరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని గడ్డంవారి పల్లె పంచాయతీలో ఇద్దరికి ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణమస్తు చెక్‌లను శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డీశ్వరరెడ్డి అందజేశారు. తువ్వచేను దళితవాడకు చెందిన భార్గవికి రూ.లక్ష, చెరువు ముందరపల్లెకు చెందిన నళశ్వనికి రూ.50వేలు మంజూరైనట్టు ఆయన చెప్పారు. వైస్ ఎంపీపీ రాశిప్రసాద్ పాల్గొన్నారు.

టీకాలు వేస్తే పాల దిగుబడి తగ్గదు



బసవపల్లెలో పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చందనప్రియ

సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లె పంచాయతీ బసవపల్లెలో పాడి రైతులకు గాలి కుంటు వ్యాధిపై పశువైద్యాధికారి డాక్టర్ చందనప్రియ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ నెల 2 నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. టీకాలు వేయడం వలన పాలదిగుబడి తగ్గుతుందనే అపోహను వీడి అందరూ పశువులకు టీకాలు వేయించాలని కోరారు. ఈ వ్యాధి సోకితే పశువులు జీవితకాలం ఇబ్బందులు పడుతుంటాయని, పాల దిగుబడి తగ్గి, వెంట్రుకలు నిక్కబొడుచుకుని ఉండటం, గస పోయడం లాంటి సమస్యతో బాధ పడుతాయని వివరించారు. ఈ లక్షణాలతో పశువులు బాధపడుతున్నట్టు గుర్తిస్తే తమ సిబ్బందికి తెలియజేయాలని కోరారు.కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది

బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తంలో శుక్రవారం కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ మాట్లాడుతూ, చర్మంపై నొప్పి, స్పర్శలేని దళసరి రాగి రంగు మచ్చలు ఉన్నపక్షంలో సమీపంలోని వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. ప్రాథమిక దశలో కుష్ఠు అని నిర్ధారణైతే క్రమం తప్పకుండా మందులు వాడి ఆరోగ్యవంతులు కావచ్చన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా యోగానంద జయంతి



ప్రార్థనలు చేస్తున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు

శాంతిపురం: క్రియా యోగి శ్రీశ్రీశ్రీ పరమహంస యోగానంద 130వ జయంతి వేడుకలను కూతేగానిపల్లె వద్ద ఉన్న పరమహంస పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ మాట్లాడుతూ, పరమహంస యోగానంద యోగా సత్సంగ సొసైటీ స్థాపించి లక్షల మందికి ధ్యానం, క్రియా యోగా పద్ధతులను నేర్పారని చెప్పారు. దేశ, విదేశాల్లో యోగా ప్రాముఖ్యతను వివరించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణన్, సత్సంగ సొసైటీ సభ్యులు చక్రపాణిరెడ్డి, నారాయణశెట్టి, గణపతిశాస్త్రి, వెంకట్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపస్ డైరీ ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నూతన డైరీని డీఈఓ విజయేంద్రరావు శుక్రవారం ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ, ఆపస్ రూపొందించిన డైరీ, క్యాలెండర్ బాగున్నాయని చెప్పారు. శవన్నగారి బాలాజీ, మంజునాథగుప్త, విజయ్ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

●రాష్ట్ర ఆరోగ్యశ్రీ సీఈఓ బాలాజి



చౌడేపల్లె: జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పులిచెర్ల(కల్లూరు): ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఆరోగ్యశ్రీ సీఈఓ బాలాజి అన్నారు. మండలంలోని కల్లూరు హైస్కూల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. దీనిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. సరైన పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. వైద్య పరీక్షలకు వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అవసరమైతే రెఫర్ చేయాలన్నారు. అనంతరం హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. శిబిరంలో 355 మందికి వైద్యపరీక్షలు చేసినట్టు కల్లూరు పీహెచ్‌సీ మెడికలాఫీసర్ డాక్టర్ జానకీరావు తెలిపారు. కార్యక్రమంలో డీఎం అండ్‌హెచ్‌ఓ ప్రభావతి, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నంజంపేటలో 302 మందికి వైద్య పరీక్షలు

సోమల: మండలంలోని నంజంపేట సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 నిర్వహించారు. శిబిరంలో మొత్తం 302 మందికి వైద్యాధికారులు జయసింహ, సోమేశ్వరెడ్డి, భార్గవి, ప్రదీప్ కుమార్ రెడ్డి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. తొలుత ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు మాట్లాడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ నాగరాజ, సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మహమ్మదాలీ జిన్నా, మాజీ సర్పంచ్ ఖయ్యూం, మాజీ ఎంపీటీసీ హరినాథ, సీహెచ్‌ఓ అమరనాథ, ఎంఎల్‌హెచ్‌పీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

రాజుపల్లెలో 257 మందికి..

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లె జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. శిబిరంలో 257 మందికి వైద్యాధికారులు మురళీకృష్ణ, తమన్నాజ్, గిరీష్మా బిందు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తొలుత శిబిరాన్ని ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఎంఈఓ గోపాల్ రెడ్డి, ఈఓపీఆర్‌ఆర్డీ శారదాదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి, క్రిష్టప్ప, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంగళంలో..

పుంగనూరు: మండలంలోని మంగళంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డితో కలసి ఎంపీపీ అక్కసాని భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. వృద్ధులకు కళ్లద్దాలు, గ్రామంలోని పెన్షన్‌దారులకు నూతన పెన్షన్లు, ఐసీడీఎస్ కార్యాలయంలో గర్భవతులకు జగనన్న సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రెండవసారి సీఎంగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నారాయణ, మెడికలాఫీసర్ సల్మా, ఐసీడీఎస్ పీఓ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29ఏ చింతమాకులపల్లెలో 186మందికి..

చౌడేపల్లె: మండలంలోని 29–ఏ చింతమాకులపల్లె సచివాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరంలో 186 మందికి వైద్య పరీక్షించి మందులు పంపిణీ చేసినట్టు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. అలాగే, శిబిరంలో జగనన్న కంటి వెలుగు కార్యక్రమం కింద అవసరమైన రోగులకు కళ్లద్దాలను ఎంపీపీ రామమూర్తి పంపిణీ చేశారు. ఆరోగ్య సురక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారులు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సర్పంచులు హైమావతి, కృష్ణారెడ్డి, షంషీర్ బాషా, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, కో–ఆప్షన్ మెంబరు సాదిక్ బాషా, ఎంపీడీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సోమల: నంజంపేటలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ భార్గవి



పుంగనూరు: కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, నాగరాజారెడ్డి



పులిచెర్ల : శిబిరంలో బాలిక ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్న ఆరోగ్యశ్రీ సీఈఓ బాలాజి

ఎమ్మెల్సీ ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండల కేంద్రానికి చెందిన దేవదాసు, ఆవులకుప్పానికి చెందిన రవి శుక్రవారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ తక్షణ సాయంగా మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. మృతదేహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ మురళీకృష్ణ, నేతలు సుధాకర్, మంజునాథ్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి



గడ్డంవారిపల్లెలో మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు

చౌడేపల్లె: కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని రాబోవు ఎన్నికల్లోనూ ఆశీర్వదించి పట్టం కట్టాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అంజిబాబు కోరారు. శుక్రవారం గడ్డంవారిపల్లెలో మహిళా సంఘాల సభ్యులకు సమావేశం నిర్వహించారు. అంజిబాబుతోపాటు ఎంపీపీ రామ్మూర్తి మాట్లాడారు. ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల కంటే ప్రజలకు అధికంగా చేశారన్నారు. గత ప్రభుత్వం మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఏమి చేశారో మహిళలందరికీ తెలుసన్నారు. పసుపు–కుంకుమ పేరిట మహిళలను మోసం చేశారని, మళ్లీ అబద్ధపు హామీలతో ముందుకొస్తున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మాటలను నమ్మి మోసపోరాదని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలో మరే రాష్ట్రం కూడా అమలు చేయలేదని, దీనిని దృష్టిలో ఉంచుకుని రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ భాగ్యవతి, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, ఎంపీటీసీ శ్రీరాములు, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, నేతలు రెడ్డెప్పరెడ్డి, సుబ్బారెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



సోమల : మాట్లాడుతున్న హార్టికల్చర్ జిల్లా అధికారి మధుసూదన్ రెడ్డి

సోమల/సదుం: మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సోమల, సదుం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరాల్లో మూడు మండలాల మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పూత, పిందె దశలో తీసుకోవాల్సిన చర్యలను మధుసూదన్‌రెడ్డితోపాటు శాస్త్రవేత్త రాఘవేంద్ర వివరించారు. మామిడిలో పురుగుల నివారణకు కోతల అనంతరం కొమ్మల కత్తిరింపు చేసి గాలీ వెలుతురు ధారాళంగా ప్రసరించేలా చూడాలన్నారు. పూత మొదలవడానికి ముందు 13.0.45(మల్టీ కే) 8 గ్రాములు, బోరాన్ 2 మి. గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే పూత బాగా వస్తుందని శాస్త్రవేత్తరాఘవేంద్ర చెప్పారు. పురుగుల మందులు వాడేటప్పుడు ఒకే రకం తరచూ వాడకుండా మార్పులు చేయాలన్నారు. కాండం నుంచి చిగురు వరకు తడిసేలా పురుగుల మందు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, చౌడేపల్లె హార్టికల్చర్ ఏఓ సంతోషికుమారి, సోమల, చౌడేపల్లె, సదుం మండలాల రైతులు పాల్గొన్నారు.

పింఛన్ల కోలాహలం



పలమనేరు : పింఛను పొంది హర్షం వ్యక్తం చేస్తున్న గంటావూరు సచివాలయ లబ్ధిదారులు

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ, మండలంలో పెంచిన రూ.3వేల పింఛన్లను శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక గంటావూరు సచివాలయంలో పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ జాఫర్, కొత్తపేటలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, ఆయా సచివాలయాల్లో సంబంధిత కౌన్సిలర్లు పంపిణీ చేసి మాట్లాడారు.అవ్వాతాతలకు ఇచ్చిన మాటకు కట్టుబడి జగనన్న దశలవారీగా పింఛన్ల సొమ్మును పెంచారన్నారు. జగనన్న మాట ఇస్తే నిలబెట్టుకుంటారని జనం బలంగా విశ్వసిస్తున్నారని, ఇదే విశ్వాసంతో రాబోవు ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కౌన్సిలర్లు షబీర్, రెహనా, కమాల్, రహీంఖాన్, శ్యామ్, నాగరాజు, కొలమాసనపల్లె సర్పంచ్ గోవిందుస్వామి, నాయకులు వీరభద్ర, మనోజ్‌రెడ్డి, శ్రీనివాసులు, వినాయక, నరసింహారెడ్డి, కుమార్, దేవేంద్ర, కోటి, గోపి, నందీశ్వర్, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: స్థానిక లింగాపురం వీధిలో శుక్రవారం రూ.3వేల పింఛన్లను వృద్ధులకు వాటర్‌షెడ్ వైస్ చైర్మన్ పీఎల్‌ఆర్ రాజారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఐలా సూరి పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో గృహసారథులు జుబేర్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డంవారిపల్లెలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీలో శుక్రవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు రెడ్డీశ్వరరెడ్డి పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, సర్పంచ్ అమరావతి, భాస్కరరెడ్డి, లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు: కొత్తపేట సచివాలయంలో..



సోమల: పింఛన్లు పంపిణీ చేస్తున్న రాజారెడ్డి, సూరి

నేడు పింఛన్ల పెంపు సంబరాలు

కుప్పం: ప్రభుత్వం జనవరి నుంచి 3 వేల రూపాయల వరకు పెంచిన పింఛన్లకు సంబంధించి శనివారం పట్టణంలో సంబరాలు నిర్వహిస్తున్న ట్లు ఎంపీడీఓ ఖాదర్ బాషా తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమీపంలో నిర్వహించే సంబరాలకు ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌తో పాటు పలువుకు అతిథులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, లబ్ధిదారు లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

గంగవరంలో..

గంగవరం: పాత పింఛన్లతోపాటు పెంచిన పింఛన్లను శనివారం ఉదయం 9 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మోహన్‌రెడ్డి శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. మండలంలోని 8440 మంది పెన్షనర్లకు రూ. 2.59 కోట్లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

మండల సర్వ సభ్య సమావేశం

వి.కోట : మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన శనివారం ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ మహ్మద్ రఫీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు అందరూ హాజరు కావాలని కోరారు.

చదువుల్లో ట్యాబ్‌లతో రాణించండి

–డీవైఈఓ ఆనందరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను చక్కగా వినియోగించుకుని చదువుల్లో రాణించాలని డీవైఈఓ ఆనందరెడ్డి అన్నారు. మండలంలోని కల్లూరు హైస్కూలును శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కొత్త సాంకేతికత పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకుపోవాలన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందని, సదుపాయాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ సిద్ధరామయ్య, ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రాజేంద్ర, ప్రకాష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వైష్ణవీదేవి

చౌడేపల్లె: మండలంలో పుదిపట్లలోని శ్రీ వైష్ణవిదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ ధర్మకర్త వినోద్‌కుమార్ రెడ్డి తెలిపారు. అభయాంజనేయస్వామి, వైష్ణవిదేవి, నాగభైరవస్వామికి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వేకువ జామున నుంచి గణపతి పూజ, హోమపూజలు, అర్చనలు, చండీహోమం నిర్వహించారు. కార్యక్రమానికి పరిసర ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ



దాత పంపిణీ చేసిన విద్యాసామగ్రితో పిల్లలు

పలమనేరు: మండలంలోని అటవీ ప్రాంత గ్రామాలైన జగమర్ల, యానాదికాలనీలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం 60మంది విద్యార్థులకు పట్టణానికి చెందిన శ్రీపురం సీతారామయ్య విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. అలాగే పిల్లల తల్లిదండ్రులకు చాపలు, దుప్పట్లు, వృద్ధులకు ఊతకర్రలను అందజేశారు. దాతకు ఉపాధ్యాయులు సలీంబాషా, సుదర్శనాచారి, గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

గుడిపాల: వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 189 కొత్తపల్లెలో గ్రామస్తులకు గ్రామపంచాయతీల విస్తరణాధికారి కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కళ్యాణ్ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాధవి, డాక్టర్ సంధ్య, సర్పంచ్ పెరిల్లా, హౌసింగ్ ఏఈ గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో సినీ నటుడు



వినాయకుని సేవలో సినీ నటుడు గరుడ రామచంద్రరాజు

కాణిపాకం(యాదమరి):కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని సినీనటుడు గరుడ రామచంద్రరాజు శుక్రవారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

గ్రూపు నుంచి తొలగించారని ఫిర్యాదు

పలమనేరు: సంఘంలో తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ గ్రూపు సభ్యులకు సైతం తెలియకుండా తనను గ్రూపు నుంచి లీడర్లు తొలగించారని పట్టణానికి చెందిన శివశంకర్ ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు లైలా శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. తాను 2014 నుంచి గ్రూపులో సభ్యురాలిగా ఉంటున్నానని, ఇప్పటివరకు ఎలాంటి పొరబాట్లు చేయలేదన్నారు. అయితే గ్రూపు సభ్యుల డబ్బును సకాలంలో లీడర్లు బ్యాంకులో జమ చేయడం లేదని తెలిసి వారిని ప్రశ్నించడంతో తనపై ఇలా కక్ష సాధింపులకు దిగి, తొలగించారని ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై విచారణ చేయాలని స్థానిక మెప్మా అధికారిని కమిషనర్ ఆదేశించారు.

సారా ఊట ధ్వంసం



సారా ఊటను పారబోస్తున్న ఎస్‌ఐ వెంకటనరసింహులు

సోమల: మండలంలో సారా తయారీ స్థావరాలపై సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు ఎస్‌ఐ వెంకట నరసింహులు శుక్రవారం తెలిపారు. 81 చిన్న ఉప్పరపల్లె, నంజంపేట పంచాయతీలకు చెందిన జంగలగుట్ట, వలసమడుగు అటవీ ప్రాంతంలో 1200 లీటర్ల ఊట ధ్వంసం చేసి, 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాలచంద్ర సిబ్బంది పాల్గొన్నారు.